క్లుప్తంగా

మిట్స్‌కు ఇంటెలెక్చువల్ ఫెసిలిటేషన్ సెంటర్

కురబలకోట : కేంద్ర ప్రభుత్వ సంస్థ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలకు రూ.100 లక్షలతో ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ ఫెసిలిటేషన్ సెంటర్ (ఐపీఎఫ్‌సీ)ని స్థాపించడానికి అనుమతినిచ్చినట్లు కళాశాల కరస్పాండెంట్ ఎన్. విజయభాస్కర్ చౌదరి, డైరెక్టర్ కీర్తనాదేళ్ల తెలిపారు. ఇందులో భాగంగా కేంద్రం మొదటి విడతగా రూ.40 లక్షల ఫండ్‌ను మంజూరు చేసిందన్నారు. ఇంటిలెక్చువల్ ప్రాపర్టీ, ఫైలింగ్ సేవలు, ఎంఎస్ ఎంఈ, స్టార్టప్‌లు, ఫ్యాకల్టీ, పరిశోధకులకు మేధో సంపత్తి హక్కులకు సంబంధించి సేవలు అందించడానికి ఉపయుక్తంగా ఉంటుందన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఇద్దరు ఎంపిక

పీలేరు రూరల్ : స్థానిక ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో చదివిన ఇద్దరు విద్యార్థినులు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు హెచ్‌ఎం నటరాజన్ తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తమ పాఠశాలలో పదవ తరగతి చదివి 575 మార్కులు సాధించిన నితీష్‌కుమార్, 561 మార్కులు సాధించిన లక్ష్మీలహరి ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి ఎంపికై నట్లు వివరించారు.

కలకడ నుంచి ఒకరు

కలకడ : స్థానిక ఆదర్శ పాఠశాల విద్యార్థినికి ట్రిపుల్ ఐటీలో సీటు సాధించినట్లు ఆ పాఠశాల ప్రన్సిపాల్ మల్లంషావల్లీ తెలిపారు. ఈ ఏడాది 10వ తరగతిలో టాపర్‌గా నిలచిన విద్యార్థిని షమీమ్‌కు ఇడుపులపాయలోని ట్రిపుల్ ఐటీలో సీటు వచ్చినట్లు తెలిపారు.

రాహుకాల పూజలు

మదనపల్లె సిటీ : వారాహీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక కోర్టు ఆవరణంలోని కోర్టులో గంగమ్మ ఆలయంలో శుక్రవారం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు రాహు,కాల పూజలు నిర్వహించారు.మహిళలు నిమ్మకాయలతో దీపాలు పెట్టి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, బీ.కె.పల్లి భక్తాదులు పాల్గొన్నారు. వారాహీ ఉత్సవాల్లో భాగంగా స్థానిక అయ్యప్పనగర్‌లోని శ్రీ బాల అయ్యప్పస్వామి ఆలయంలో గాయిత్రిదేవికి నవధాన్యాలతో అలంకరించారు. స్థానిక దేవళంవీధిలోని శ్రీ సోమేశ్వరస్వామి ఆలయంలో లలితత్రిపురసుందరిదేవి అమ్మవారికి పూజలు చేశారు.

అక్రమ కట్టడాలు కూల్చివేత

పీలేరు : పీలేరు పట్టణ శివారు ప్రాంతం బోడుమల్లువారిపల్లె పంచాయతీలో అక్రమ కట్టడాలను రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. శుక్రవారం బోడుమల్లువారిపల్లె పంచాయతీ సర్వే నెంబరు 908/4లో జరిగిన అక్రమ నిర్మాణాలను తహసీల్దార్ మహబూబ్ బాషా తన సిబ్బందితో పరిశీలించారు. అక్రమంగా నిర్మించిన కట్టడాలను జేసీబీ సాయంతో తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోవిందురాజుకుంట చెరువు భూమిలో అక్రమంగా నిర్మించిన మూడు ఇళ్లను కూల్చివేసినట్లు తెలిపారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఇన్‌చార్జ్ ఎస్‌ఓగా మదన్‌మోహన్

బి.కొత్తకోట : మండలంలోని హార్సిలీహిల్స్ అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్‌గా మదనపల్లె డిప్యూటీ రేంజర్ మదన్‌మోహన్ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న సెక్షన్ ఆఫీసర్ ఆడపా శివకుమార్ మూడునెలల పాటు అటవీశాఖ శిక్షణ కోసం రాజమండ్రి వెళ్లారు. దీనితో ఆయన తిరిగొచ్చే దాక డీఆర్‌ఓ అదనపు బాధ్యతలను నిర్వర్తిస్తారు.

ముచ్చుమర్రి ఘటనలో నిందితులను శిక్షించాలి

మదనపల్లె : నంద్యాల జిల్లా ముచ్చుమర్రి గ్రామంలో తొమ్మిదేళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడి చంపేసిన ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని ఐద్వా నాయకులు డిమాండ్ చేశారు. దురాగతాన్ని ఖండిస్తూ పట్టణంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కన్వీనర్ భాగ్యమ్మ, సీఐటీయూ జిల్లా కోశాధికారి హరిశర్మ మాట్లాడుతూ... రాష్ట్రంలో అనకాపల్లి, ఇతర ప్రాంతాల్లోనూ మహిళలపై అత్యాచారాలు పెరిగిపోతున్నాయని, ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి వీటిని అరికట్టాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐద్వా పట్టణ నాయకురాళ్లు రెడ్డిప్రసూన, భాను, లక్ష్మీదేవి, రాజమ్మ, లక్ష్మి, వెంకటమ్మ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మండల మీట్ వాయిదా

కురబలకోట : మండల మీట్ వాయిదా పడింది. శుక్రవారం జరగాల్సిన మండల మీట్‌కు ఎంపీటీసీ సభ్యులు హాజరుకాకపోవడంతో వాయిదా వేసినట్లు ఎంపీడీఓ హరినారాయణ తెలిపారు. తిరిగి ఎప్పుడన్నది సోమవారం తర్వాత తెలియజేస్తామని తెలిపారు. వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. చివరకు వాయిదా పడటంతో వారు వెనుదిరిగి వెళ్లారు.


బార్ అధ్యక్ష, కార్యదర్శుల నియామకం

వాల్మీకిపురం : వాల్మీకిపురం జూనియర్ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. శుక్రవారం స్థానిక బార్ కార్యాలయంలో ఎన్నికల అధికారిగా కరీముల్లా బేగ్ వ్యవహరించగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రెండవ సారి బార్ అధ్యక్షులుగా ఆనంద్ కుమార్, జనరల్ సెక్రటరీగా రమణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా మూర్తయ్య, తదితర సభ్యులు ఎన్నికయ్యారు.



వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అమ్మ ఒడి అమలు చేశారు. వైఎస్ జగన్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాల అనే తేడా లేకుండా విద్యార్థులకు అమ్మఒడి పథకాన్ని పటిష్టంగా అమలు చేశారు. ఎలాంటి కొర్రీలు .. నిబంధనలు లేవు. పక్కాగా అమ్మఒడి అమలైంది. ఒక్కో విద్యార్థికి రూ.15 వేలు చొప్పున తల్లుల ఖాతాలకు ఏటా తప్పకుండా చెప్పిన సమయానికి జమ చేశారు.

'అమ్మఒడి' స్థానంలో 'తల్లికి వందనం' పేరుతో ఇంటిలో ఎంతమంది విద్యార్థులుంటే అందరికీ ఏటా రూ.15 వేలు ఇస్తాం' అని ఎన్నికల వేళ ప్రతి సభ.. సమావేశంలో చంద్రబాబు చెప్పిన మాటలివి. అయితే అధికారంలోకి వచ్చాక ఆయన మాటల గారడీ బయటపడింది. ఇప్పుడు మాట మార్చారు.. హామీ పక్కనబెట్టారు. నయవంచనకు దిగారు. ఒక్కరికే వందనం అంటూ జీఓ జారీ చేశారు. ఈ విషయం తెలిసి.. తల్లిదండ్రులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.. అమలు చేయనప్పుడు హామీ ఎందుకిచ్చారంటూ ప్రశ్నిస్తున్నారు.



బాబు సూపర్ 6

స్కూలుకు వెళ్ళే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ. 15,000

తల్లికి వందనం
పిల్లలకు బంధనం

- ఎంతమంది పిల్లలుంటే అందరికీ తల్లికి వందనం అన్నారు
- మేనిఫెస్టోలో చేర్చి ఊదరగొట్టారు
- అధికారంలోకి వచ్చాక ఒకరికే అంటున్నారు
- ఇద్దేం పద్ధతి బాబూ.. అంటూ తల్లిదండ్రుల మండిపాటు

వైఎస్ జగన్ పాలనలో అమ్మఒడి లబ్ధి

మదనపల్లె అర్బన్, రూరల్‌లో..

ప్రభుత్వ పాఠశాలలు	: 138
ప్రైవేటు పాఠశాలలు	:114
ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య	: 13369
ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య	: 22412
2023–24 అమ్మ ఒడి లబ్ధిదారులు	: 9582
సొమ్ము	: రూ. 1,43,730,000

మండలం	విద్యార్థుల సంఖ్య	చెల్లించింది (కోట్లలో)
బి.కొత్తకోట	20,240	రూ.30.36
పెద్దతిప్పసముద్రం	13,572	రూ.20.35
ములకలచెరువు	22,182	రూ.33.27
కురబలకోట	14,263	రూ.21.39
పెద్దమండ్యం	17,657	రూ.26.48
తంబళ్లపల్లె	11,894	రూ.17.84

మదనపల్లె సిటీ/బి.కొత్తకోట/పీలేరు : పేదరికం కారణంగా ఏ ఒక్క విద్యార్థి చదువుకు దూరం కాకూడదన్న ఉద్దేశంతో గత ప్రభుత్వం అమ్మఒడి పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేసింది. పాఠశాలలు ప్రారంభమైన వారం పది రోజుల్లో పిల్లలను బడికి పంపే ప్రతి తల్లిఖాతాకు ఇచ్చిన హామీ మేరకు రూ.15 వేలు జమ చేసింది. చంద్రబాబు నాయుడు ఎంత మంది చదువుతున్నా అందరికీ తల్లికి వందనం పేరుతో రూ.15 వేల చొప్పున ఇస్తానని మాట మార్చడంపై తల్లిదండ్రులు మండిపడుతున్నారు.

పిల్లలను ఎలా చదివించాలి



నా పేరు షేక్ సుల్తానా. నా భర్త ఖాదర్ పూల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాం. నాకు ముగ్గురు ఆడ పిల్లలు. పెద్ద పాప అలీమా తబుసమ్ ప్రైవేటు కాలేజీలో ఇంటర్మీడియట్ చదువుతుంది. రెండో పాప ఆసీఫా ఎనిమిదో తరగతి ప్రభుత్వ పాఠశాలలో చదువుతుంది. మూడవ పాప ఫర్మానా ఏడో తరగతి చదువుతుంది. గతంలో అమ్మ ఒడి కింద పెద్దపాపకు వచ్చేది. టీడీపీ నాయకులు ఎన్నికల్లో ఇంట్లో ఎందరు చదువుకుంటుంటే అందరికి రూ.15 వేలు చొప్పున ఇస్తామన్నారు. ఈ లెక్కన మాకు రూ.45 వేలు రావాలి. డబ్బులు వస్తాయన్న ఆశతో మా పెద్ద పాపను ప్రైవేటు కాలేజీలో చేర్పించాం. ఇప్పుడు ఒక్కరికి మాత్రమే ఇస్తామంటున్నారు. పిల్లలను ఎలా చదివించాలి.

నిరాశ కలిగించింది



నా పేరు వి.శోభన, నాకు ఇద్దరు పిల్లలు. పెద్ద బాబు రెడ్డి శివశ్రీ క్రిష్ణ ఎనిమిదో తరగతి, చిన్నబాబు రెడ్డి శివసాయి వెంకట్ రెండో తరగతి ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నారు. గతంలో పెద్దబాబుకు అమ్మ ఒడి వచ్చింది. ఈ ఏడాది ప్రభుత్వంలో ఇద్దరికి వస్తుందని ఎంతో ఆనంద పడ్డాము. చివరకు ఒక్కరి మాత్రమే ఇస్తామనడం నిరాశ కలిగించింది. ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలుపుకుని చదువుకునే పిల్లలందరికి అమ్మకు వందనం అందించాలి.

ఒకరికే అంటే ఎలా ?



గత ప్రభుత్వంలో పాఠశాలలు తెరవగానే అమ్మఒడి సొమ్ము బ్యాంకు ఖాతాకు జమ అయ్యేది. నాకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఒకరు పాపేపల్లె ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి, మరొకరు యల్లంవారిపల్లె ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నారు. ప్రభుత్వం కొత్తగా తల్లికి వందనం పేరుతో ఎంత మంది పిల్లలు చదువుతుంటే అందరికి రూ.15 వేలు చొప్పున ఇస్తామని ఎన్నికల సమయంలో చెప్పారు. ఇప్పుడేమో ఒకరికే రూ.15 వేలు ఇస్తామని చెబుతున్నారు.

– ఎం.జయసుధ, పాపేపల్లె, పెద్దమండ్యం

ఫీజులు ఎలా చెల్లించాలి



తల్లికి వందనం పేరుతో ఇంటిలో ఎంత మంది విద్యార్థులుంటే అంత మందికి తల్లి ఖాతాలో రూ. 15 వేలు చొప్పున జమ చేస్తామన్న ముఖ్యమంత్రి చంద్రబాబు తన మాట నిలబెట్టు కోవాలి. నాకు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఒక కుమారుడు పీలేరులో, మరో కుమారుడు తిరుపతిలో ప్రయివేట్ పాఠశాలల్లో చదువుతున్నారు. ఇప్పటికే ఫీజులకు, పుస్తకాలకు ఖర్చు పెట్టడం జరిగింది. తల్లికి వందనం డబ్బులు ఖాతాలో పడితే తోడ్పాటు అందించినట్లవుతుంది.

– లావణ్య, గ్యారంపల్లె, కేవీపల్లె మండలం

మాట నిలబెట్టుకోవాలి



ఎన్నికల సమయంలో తల్లికి వందనపై చంద్రబాబు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి. నాకు ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఇద్దరూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. చంద్రబాబు హామీ మేరకు ఇద్దరు విద్యార్థులకు తల్లికి వందనం డబ్బులు ఇవ్వాల్సి ఉంది. ఆ డబ్బులు మా ఖాతాలో జమ అయితే మా లాంటి పేదవారిని ఆదుకున్నట్లవుతుంది.

– శిరీష, పీలేరు

ఆర్థిక కష్టాలు తప్పవు



ఇంటిలో ఎంత మంది పిల్లలు చదువుతుంటే అందరికి రూ.15 వేలు చొప్పున ఇస్తానని మాటిచ్చిన చంద్రబాబు హామీ నిలబెట్టుకోవాలి. ఎన్నికల్లో ఇచ్చిన హామీపై నమ్మకంతో నా ఇద్దరు పిల్లలను బాగా చదివించాలని ప్రైవేటు బడిలో చేర్పించాను. ఎనిమిది, పదో తరగతి చదువుతున్నారు. చదువుకు ఇద్దరికి రూ.లక్ష దాకా ఖర్చవుతుంది. ఇప్పుడు ఇంటికి ఒకరికే తల్లికి వందనం వర్తింపజేస్తే మాలాంటి వాళ్లకు ఆర్థిక కష్టాలు తప్పవు.

– కమల, చేనేత నగర్, కురబలకోట

అందరికీ ఇవ్వాలి



టీడీపీ మేనిఫెస్టోలో చెప్పిన విధంగా ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుకొంటున్నారో అందరికి తల్లికి వందనం ఇవ్వాలి. నాకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఒకరు ఇంటర్, రెండవ వాడు తొమ్మిదో తరగతి, పాప ఆరవ తరగతి చదువుతోంది. ఒకరు ప్రభుత్వ పాఠశాలలో, ఇద్దరు ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్నారు. ప్రైవేట్ స్కూల్ యాజమాన్యం ఫీజు చెల్లించాలని బిల్లులు పంపించారు. తల్లికి వందనం వస్తుందని ధైర్యంగా ఉన్నాం.

– నాగరత్నమ్మ, కొత్తపల్లె, గుర్రంకొండ

ఇలా మోసం చేస్తే ఎలా..



నా పేరు ఎస్.నగీనా. నా భర్త పేరు షహన్‌షా, లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. పెద్ద పాప హాజీరా పదో తరగతి మున్సిపల్ ఉన్నత పాఠశాలలో చదువుతుంది. రెండో పాప రహమతున్నీసా తొమ్మిదో తరగతి చదువుతుంది. గతంలో పెద్ద పాపకు అమ్మ ఒడి వచ్చేది. ఎన్నికల్లో ఇంట్లో చదువుకునేవారందరికి తల్లికి వందనం కింద రూ.15 వేలు ఇస్తామన్నారు. ఇద్దరి పిల్లలకు రూ.30 వేలు వస్తుందని ఆశపడ్డాము. ఇలా మోసం చేస్తారని అనుకోలేదు.

ఫీజులు చెల్లించడం కష్టం



నా పేరు నగీనా. నా భర్త సయ్యద్‌బాషా లారీ డ్రైవర్. నాకు ఇద్దరు పిల్లలు. పెద్ద బాబు మహమ్మద్ అబ్దుల్లా. ప్రైవేటు స్కూలులో మూడవ తరగతి చదువుతున్నాడు. పాప షేక్ షబీహా రెండవ తరగతి ప్రైవేటు స్కూలులో చదువుతుంది. గతంలో బాబుకు అమ్మ ఒడి కింద రూ.15 వేలు వచ్చేది. ఎన్నికల్లో తల్లికి వందనం పేరుతో ఇంట్లో చదువుకునేవారిందరికి రూ.15వేలు ఇస్తామన్నారు. ప్రస్తుతం ఒక్కరికే ఇస్తామనడంతో మా పిల్లలకు ఫీజులు ఎలా కట్టాలి? ఇస్తామని చెప్పి మాట తప్పడం సరికాదు.

మాట తప్పరాదు



నా పేరు మాబున్నీ. నా భర్త సత్తార్ ఇంటి వద్దే ఉంటారు. నాకు ఇద్దరు పిల్లలు. పెద్ద బాబు షామీర్ పట్టణంలోని ప్రైవేటు కాలేజీలో ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. చిన్న పాప సుమియా 6వ తరగతి ప్రభుత్వ పాఠశాలలో చదువుతుంది. గతంలో బాబుకు అమ్మ ఒడి వచ్చేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే పిల్లలందరికి తల్లికి వందనం ఇస్తామన్నారు. ప్రస్తుతం కేవలం రూ.15వేలు ఇస్తామని ప్రకటించడం బాధగా ఉంది. రాజకీయ నాయకులు మాట తప్పడం మంచి పద్ధతి కాదు. హామీలు నిలబెట్టుకున్నప్పుడే ప్రజలకు వారిపై నమ్మకం ఉంటుంది.

యాజమాన్య పద్ధతులపై అవగాహన

మదనపల్లె : మామిడి, వేరుశనగ, వరి, టమాటా పంటల్లో యాజమాన్య పద్ధతులు, కలుపు, తెగుళ్ల నివారణపై కలికిరి కేవీకే శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నియోజకవర్గంలోని రైతుసేవా కేంద్రాల సిబ్బందికి శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలోని రైతుసేవా కేంద్రాల సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండటమే కాకుండా ప్రతిరోజు క్షేత్రస్థాయిలో పర్యటించాలని ఏడీఏ శివశంకర్ అన్నారు. రైతులు మామిడి పంటకు సంబంధించి ప్రతి ఏడాది జూన్, జూలైలో 20 నుంచి 30 శాతం ఒక అడుగువరకు కొమ్మలు కత్తిరించాలన్నారు. తేనెమంచు పురుగుతో నష్టం వాటిల్లకుండా నీమ్‌ఆయిల్ 150 పీపీఎం, ఎమిడాక్లోపిడ్ స్ప్రే చేయాలన్నారు. వర్షాధారానికి వేరుశెనగ 1 ఎకరానికి 60 కిలోల విత్తనం వేస్తే ఒక చదరపు మీటరుకు 33 మొక్కలు వచ్చేలా జాగ్రత్తపడాలన్నారు. పంటలో కలుపు నివారణకు విత్తకముందు దుక్కిలో జిప్సమ్ ఒక ఎకరానికి 200 కిలోలు వేయాలన్నారు. తర్వాత పూతదశలో మొక్కదగ్గర జిప్సమ్ వేయాలన్నారు. వరి రైతులకు సంబంధించి బయో ఎరువులు తిరుపతి, కలికిరి కేవీకేల్లో అందుబాటులో ఉన్నాయని అవసరమైన రైతులు కొనుగోలు చేయాలన్నారు. చిన్న కమతాలు, భూములు ఉన్న రైతులు హ్యాండ్‌పుష్ సీడర్ తీసుకుంటే అన్ని రకాల గింజలు వేసుకోవచ్చన్నారు. హార్టికల్చర్ అధికారి ఈశ్వర ప్రసాద్ మాట్లాడుతూ..ఎస్సీ,ఎస్టీలకు మల్చింగ్ ఎప్పుడైనా ఇవ్వవచ్చన్నారు. ప్యాక్‌హౌస్, ఫారం ఫాండ్స్, షేడ్‌నెట్స్, పెండాల్స్, డ్రిప్ ఇరిగేషన్ అవసరమైన రైతులు హార్టికల్చర్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.



మాట్లాడుతున్న హార్టికల్చర్ ఆఫీసర్ ఈశ్వరప్రసాద్, ఏడీఏ శివశంకర్ తదితరులు

మైనర్లు వాహనాలు నడిపితే కఠినచర్యలు

వన్‌టౌన్ సీఐ వలీబాషు

మదనపల్లె : మైనర్లు వాహనాలు నడిపితే కఠినచర్యలు తప్పవని వన్‌టౌన్ సీఐ వలీబాషు హెచ్చరించారు. శుక్రవారం సాయంత్రం పట్టణంలోని బెంగళూరు బస్టాండు ఇందిరాసర్కిల్‌లో వాహనదారులకు రహదారి భద్రత, నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...మద్యం సేవించి వాహనాలు నడిపితే రూ.10వేల జరిమానా చెల్లించాల్సి ఉంటుందన్నారు. హెల్మెట్ లేకుండా డ్రైవింగ్ చేసినా, వాహనానికి సంబంధించిన రికార్డులు లేకపోయినా నూతన చట్టాల ప్రకారం అధిక మొత్తంలో జరిమానా చెల్లించాల్సి ఉంటుందన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులు, వాహన యజమానులపై చర్యలు తప్పవన్నారు. వాహనం నడిపేవారు తప్పనిసరిగా డ్రైవింగ్‌లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. రహదారి నియమనిబంధనలు కచ్చితంగా పాటించి పోలీసులకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో పోలీస్‌సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

వాల్మీకిపురం : సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని మండలంలోని చింతపర్తి పిహెచ్‌సి వైద్యాధికారి జులేఖ బేగం అన్నారు. శుక్రవారం మండలంలోని చింతపర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు డయేరియా, డెంగా, లెప్రసీ, పెద్దల బీసీజీ టీకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. 5 సంవత్సరాల లోపు పిల్లల ఇంటికి రెండు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశామన్నారు. అలాగే ఈ నెల 18 నుంచి ఆగస్టు 2 వరకు ఇంటింటి లెప్రసీ సర్వే జరుగుతుందన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని, ఇళ్ల పరిసర ప్రాంతాల్లో నిల్వ నీరు లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది మహమ్మద్ రఫీ, ఇందిరా, సుధాకర్, భానుబీ, హృదఈశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహుడికి పూజలు

గుర్రంకొండ : మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామి వారికి శనివారం టీటీడీ వారి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామునే స్వామివారికి పలు రకాల నైవేద్యాలు సమర్పించి అభిషేకాలు, అర్చనలు చేశారు. తోమాల సేవ, ఏకాంతసేవ కావించారు. ఈసందర్భంగా స్వామివారిని రంగురంగుల పుష్పాలతో అందంగా అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకొని స్వామివారిని సేవించుకొన్నారు. అర్చకులు భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

పేపర్ బ్యాగ్స్ వినియోగిద్దాం

వాల్మీకిపురం : స్థానిక పీవీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 35వ ఆంధ్ర బెటాలియన్ ఎన్‌సీసీ చిత్తూరు వారి ఆధ్వర్యంలో ప్రపంచ పేపర్ బ్యాగ్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం సావిత్రి మాట్లాడుతూ పర్యావరణానికి హాని చేసే ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్‌లను వాడకుండా పేపర్ బ్యాగ్‌లను మాత్రమే వాడాలన్నారు. అలాగే కాటన్ బ్యాగ్స్, జూట్ బ్యాగ్స్ వాడటం అలవాటు చేసుకోవాలని, మార్కెట్‌కు వెళ్లే ముందు తప్పక క్యారీ బ్యాగ్ తీసుకొని వెళ్లటం వల్ల పర్యావరణాన్ని రక్షించుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో ఎన్‌సిసి కేర్‌టేక్ ఆఫీసర్ రవీంద్ర రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరామర్శ

ములకలచెరువు : టీడీపీ నాయకుల దాడిలో గాయపడి మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మాజీ సర్పంచ్ రవీంద్రారెడ్డి, శ్రీనివాసులును తంబళ్లపల్లె నియోజక వర్గానికి చెందిన పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు శుక్రవారం పరామర్శించారు. దాడి ఘటనను అడిగి తెలుసుకున్నారు. ములకలచెరువు మండల కన్వీనర్ మాధవరెడ్డి, జెడ్పీటీసీ మోహన్‌రెడ్డి, సర్పంచ్‌లు రవిశేఖర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, ఎంపీటీసీలు కృష్ణప్ప, కిట్టన్న, చాంద్‌బాషా తదితరులు బాధితులను పరామర్శించారు.

చింతపర్తి పీహెచ్‌సీకి విరాళం

వాల్మీకిపురం : మండలంలోని చింతపర్తి పీహెచ్‌సీకి దాత ఆలూరి సత్యనారాయణ శర్మ దంపతులు డాక్టర్ శ్రీవిద్య సమక్షంలో ఐసీయూ మంచం వితరణగా అందించారు. ఈ సందర్భంగా దాత మాట్లాడుతూ ఆసుపత్రికి కావలసిన చిన్న చిన్న పరికరాలు అందజేస్తామన్నారు. అనంతరం దాతకు ఆసుపత్రి సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

జాతీయస్థాయి క్విజ్‌పోటీల్లో ప్రతిభ

మదనపల్లె : జాతీయస్థాయిలో నిర్వహించిన నేషనల్ ఫైనాన్షియల్స్ లిటరసీ క్విజ్ పోటీల్లో శ్రీ జ్ఞానాంబికా డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనపరిచి నగదు బహుమతి, ప్రశంసాపత్రాలను పొందారని కరస్పాండెంట్ గురుప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ..ముంబైలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సెక్యూరిటీస్ మార్కెట్స్(ఎన్‌ఐఎస్ఎం)లో జరిగిన ఫైనాన్షియల్ లిటరసీ క్విజ్‌లో కళాశాల విద్యార్థులు పాల్గొన్నారన్నారు. ఇందులో కళాశాల విద్యార్థులు జాతీయస్థాయిలో మూడో బహుమతి సాధించారన్నారు. దీనికి గాను ఎన్‌ఐఎస్ఎం సంస్థ రూ.25వేల నగదుబహుమతితో పాటు ప్రశంసాపత్రాలను అందించిందన్నారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులను ప్రిన్సిపాల్ సురభిరమాదేవి, వైస్ ప్రిన్సిపాల్ రాఘవేంద్ర అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్

వైద్యసేవలు మెరుగుపడాలి

మదనపల్లె : అర్బన్ హెల్త్ సెంటర్, పీహెచ్‌సీల్లో వైద్య సేవలు మరింత మెరుగుపడాలని మదనపల్లె డిప్యూటీ డీఎంహెచ్‌ఓ రమేష్‌బాబు అన్నారు. శుక్రవారం పట్టణంలోని త్యాగరాజవీధిలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో వైద్యశాలల పనితీరుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..జిల్లావ్యాప్తంగా పనితీరులో 16 అర్బన్‌హెల్త్ ప్రైమరీ సెంటర్లు వెనుకబడ్డాయన్నారు. అందులో పట్టణంలోని రామారావుకాలనీ, త్యాగరాజవీధి అర్బన్‌సెంటర్లతో పాటు పీటీఎం మండలం కందుకూరు, వాల్మీకిపురం మండలం నగిరిమడుగు పీహెచ్‌సీ కేంద్రాలు ఉన్నాయన్నారు. ఆయా వైద్యశాలల్లో సిబ్బంది అంకితభావం చూపి వైద్యసేవల సంఖ్యను మెరుగుపరచాలన్నారు. టీకాల పంపిణీ క్షేత్రస్థాయిలో ఆరోగ్యపరిరక్షణ తదితర అంశాలపై మెరుగైన పనితీరు కనపరచాలన్నారు. వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయండి

పీలేరు రూరల్ : ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీవో ఉపేంద్రరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ సిబ్బంది, ఇంజినీరింగ్ అసిస్టెట్లు, హౌసింగ్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంద రోజుల ప్రణాళికలో భాగంగా మండలంలో 5076 ఇళ్లకు గానూ 1603 ఇల్లు నిర్మాణాలు పూర్తి అయ్యాయని తెలిపారు. 254 మోల్డింగ్ దశలో, 456 గోడల దశలో, 2276 ఇళ్ళు గుణతాలు పూర్తి చేశారని తెలిపారు. 428 ఇళ్ల నిర్మాణాలు ఇంత వరకు ప్రారంభించలేదని చెప్పారు. డిసెంబరు ఆఖరు నాటి హౌసింగ్ ఇళ్ల పూర్తి అయ్యేలా సిబ్బంది పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం లక్ష్మణరెడ్డి, ఏపీవో మహేశ్వర్, హౌసింగ్ ఏఈ బాలాజి నాయక్ పాల్గొన్నారు.

పశువుల పెంపకంపై జాగ్రత్తలు తీసుకోవాలి

వాల్మీకిపురం : పశువుల పెంపకంలో పాడి రైతులు జాగ్రత్తలు తీసుకోవడం వలన అధిక పాలదిగుబడి సాధించవచ్చని వాల్మీకిపురం పశువైద్యశాల సహాయ సంచాలకులు నీరజ అన్నారు. మండలంలోని ఓబులంపల్లిలో శుక్రవారం పశుగ్రాస వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పశువుల్లో వచ్చే గర్భకోశ వ్యాధులను పరీక్షించి పాడిరైతులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన పాడిరైతుల సమావేశాన్ని ఉద్దేశించి పలువురు మాట్లాడారు. పాడి ఆవుల పెంపకం, వాటిలో వచ్చే వ్యాధులు, వాటి నివారణ, దూడల పెంపకం, నత్తల నివారణ తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది శివశంకర్, తదితరులు పాల్గొన్నారు.